7

సాక్షి సంగారెడ్డి

ఆదివారం ၊ 4 ၊ ఆగస్టు ၊ 2024



న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు సుధారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏదైనా కారణం చేత చేనేత కార్మికుడు మృతిచెందితే ఐదు లక్షల రూపాయల బీమా వర్తిస్తుందని, పూర్తి సర్టిఫికెట్లతో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కేజీబీవీని సందర్శించిన డీఈఓ




విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వర్లు

నారాయణఖేడ్: ఖేడ్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని డీఈఓ వెంకటేశ్వర్లు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో బోధనా తీరును విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట సరకుల స్టాక్ గదిని తనిఖీ చేశారు. గణితం, ఆంగ్లం, సైన్స్ సబ్జెక్టుల బోధనలో మరింత శ్రద్ధపెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓలు విశ్వనాథ్, శంకర్ ఉన్నారు.

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని డీఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

ఐటీ చట్టాల గురించి తెలుసుకోవాలి



రాజు నారాయణ స్వామి

పటాన్‌చెరు: సైబర్ సెక్యూరిటీ పాఠ్యాంశాన్ని అభ్యసించే విద్యార్థులు ఐటీ చట్టం 2000పై అవగాహన కలిగి ఉండాలని కేరళ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, ఐఏఎస్ డాక్టర్ రాజు నారాయణస్వామి అన్నారు. 'కృత్రిమ మేథ యుగంలో సైబర్ సెక్యూరిటీ' అనే అంశంపై శుక్రవారం గీతం యూనివర్సిటీలో ఆయన బీటెక్ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. సైబర్ భద్రతకు క్వాంటం కంప్యూటింగ్ వల్ల కలిగే ముప్పు గురించి ఆయన వివరించారు. సైబర్ కిల్ చైన్, ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ అప్రోచ్, ఆర్టిఫిషియల్-డీప్ న్యూరల్ నెట్‌వర్క్‌ల చిక్కులు తదితర అంశాలు చర్చించారు.

అనుమతులు రద్దు చేయండి

పటాన్‌చెరు: జిన్నారం మండలం సోలక్‌పల్లి రెవెన్యూ రాళ్లకత్వ గ్రామ పరిధి పెద్ద చెరువు సమీపంలో సర్వేనెంబర్ 286 భూమిలో ఏర్పాటు చేస్తున్న కంకర క్వారీ, క్రషర్ల నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు తహసీల్దార్, ఆర్డీఓ, ఇరిగేషన్ డీఈకి.. కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్రషర్, క్వారీలు ఏర్పాటుతో సమీపంలోని పొలాలు, కాల్వలు, చెక్ డ్యామ్‌లు దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, జింక రవి, శ్రీనివాస్, మహేష్, అమీర్, బాలు, నవీన్, గణేష్ పాల్గొన్నారు.

కొల్లూర్ పోలీస్‌స్టేషన్‌కు సైబరాబాద్ సీపీ



సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ అవినాష్ మహంతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సందర్శించారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి సూచనలు చేశారు.

ఖేడ్ రేంజ్ అధికారిగా అనురాధ

నారాయణఖేడ్: ఖేడ్ అటవీశాఖ రేంజి అధికారిగా అనురాధ నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన చంద్రశేఖర్‌ను కల్హాపూర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో హైదరాబాద్ కేబీఆర్ పార్కులో విధులు నిర్వర్తించిన అనురాధ బాధ్యతలు స్వీకరించారు.

నేర రహిత సమాజాన్ని స్థాపిద్దాం

మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ



మాట్లాడుతున్న ఐజీ సత్యనారాయణ

సంగారెడ్డి: నేర రహిత సమాజాన్ని స్థాపనే ధ్యేయంగా ప్రతీఒక్కరు పనిచేయాలని మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ సూచించారు. శనివారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపడానికి ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలో పోలీసులు పని తీరు భేషుగ్గా ఉందని కితాబు ఇచ్చారు. డ్రగ్స్ నియంత్రణకు కర్నాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో గట్టి నిఘా పెట్టాలని చెప్పారు. కార్మికులు నివాసం ఉండే పటాన్‌చెరు ఏరియాలో ప్రత్యేక గస్తీ నిర్వహించాలని సూచించారు. ఖేడ్ ప్రాంతంలో గాంజా సాగు చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్‌హెచ్‌ఓలు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ప్రతీ చిన్న కంప్లైట్‌ను స్వీకరించాలన్నారు. డ్రగ్స్ వివరాలు తెలిస్తే 8712656777 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, డీఎస్పీలు సత్తయ్యగౌడ్, రవీందర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: గంజాయి, ఆల్ప్రాజోలం, డ్రగ్స్ తదితర మాదకద్రవ్యాల దందా, వినియోగాన్ని కట్టడి చేయడంపై పోలీసుశాఖ దృష్టి సారించింది. ఈ అక్రమ దందా మూలాలను వెతికేందుకు ప్రత్యేకంగా ఎస్-నాబ్ (సంగారెడ్డి నార్కోటిక్ అనాలసిస్ బ్రాంచ్)ను ఏర్పాటు చేసింది. ఈ బ్రాంచ్ పనితీరు సత్ఫలితాలనిస్తోందని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఈ ఎస్-నాబ్ ద్వారా సేకరించిన సమాచారంతో ఇటీవల జిల్లాలో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. మనూరు మండలం

డ్రగ్స్ దందాపై స్పెషల్ ఫోకస్

- ఫలితాలనిస్తున్న 'ఎస్ నాబ్'
- ప్రత్యేక విభాగంతో పలు కేసులు నమోదు

బోరంచ సమీపంలో ఓ వ్యక్తి వద్ద 21 కిలోల గంజాయిని మనూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని వినియోగిస్తున్నారనే అనుమానం కలిగితే వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపుతున్నారు.



ఎన్‌డీపీఎస్ చట్టం

ఇంటర్నేషనల్ డ్రగ్ అబ్యూస్, లిటికల్ ట్రాఫికింగ్ (వరల్డ్ డ్రగ్‌డే)ను పురస్కరించుకుని జిల్లా పోలీసుశాఖ ఎస్-నాబ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ విభాగం ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించిన కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎవరైనా గంజాయి అక్రమ రవాణా, డ్రగ్స్ దందా నిర్వహించినా, వినియోగించినా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 8712656777 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసుశాఖ విజ్ఞప్తి చేసింది. ఇలా వచ్చిన కీలక సమాచారాన్ని సంబంధిత పోలీసుస్టేషన్లకు పంపించి వెంటనే చర్యలు తీసుకునేలా ఈ ప్రత్యేక విభాగం పనిచేస్తుంది.

డాటాబేస్ సేకరణ

ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించి పూర్తి డాటాబేస్‌ను ఈ విభాగం నిర్వహిస్తోంది. ఇతర జిల్లాల్లో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులతో జిల్లాకు ఏమైనా లింకులున్నాయా అని ఆరా తీస్తున్నారు. అలాగే గతంలో గంజాయి దందాకు పాల్పడిన వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేశారు. ఇందుకోసం సస్పెక్ట్ షీట్‌లను సైతం తెరుస్తున్నారు. ఎక్సైజ్‌శాఖలో నమోదైన కేసులకు సంబంధించిన డాటాను కూడా ప్రత్యేక విభాగం ఎస్-నాబ్ సేకరిస్తోంది. ఈ రెండు శాఖల సమన్వయంతో పనిచేసే ప్రయత్నం చేస్తోంది.

ఏఓబీ లింకులపైనా నజర్

గంజాయి దందాకు సంబంధించిన ఏఓబీ (ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల)తో జిల్లాకు లింకులపైనా ఎస్-నాబ్ నజర్ పెట్టింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దందా నిర్వాహకులను గుర్తించే పనిలో పడింది. జిల్లాలో గంజాయి అమ్మేవారు అధికంగా ఉన్నారు. అలాగే ఆల్ప్రాజోలం వంటి తయారీ కేంద్రాల గుట్టు రట్టయిన విషయం తెలిసిందే. రెండు జాతీయ రహదారులు ఉండటంతో అక్రమ రవాణాకు జిల్లా రహదారిగా మారింది. ఈ నేపథ్యంలో ఎస్-నాబ్ విభాగానికి ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లాలో ఎక్కడైన గంజాయి, డ్రగ్స్ దందా జరిగినా, వినియోగిస్తున్నట్లు తెలిసినా ఎస్-నాబ్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు. వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని బరోసా ఇస్తున్నారు.

'ధరణి' సమస్యలు పరిష్కరించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి టౌన్: 'ధరణి' సమస్యలను త్వరగా పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. సీసీఎల్ఏ కార్యాలయం నుంచి శనివారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి సమస్యలను పరిష్కారానికి నూతనంగా రూపొందించిన ఆర్ఓఆర్ ముసాయిదా బిల్లుపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ క్రాంతి మండలాధికారులతో మాట్లాడారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులపై రివ్యూ చేసి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీపీఓ సాయిబాబా పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలి

నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ కోసం ఆగస్టు మొదటి వారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి మూడు నెలల్లో వెరిఫికేషన్ పూర్తి చేస్తామన్నారు. రోడ్డు వెడల్పు ఓపెన్ స్పేస్ తదితర నిబంధనలు లేఅవుట్‌లో పాటించారా లేదా అనే అంశాన్ని పరిశీలించి ప్లానింగ్ అధికారి ఆమోదిస్తారని చెప్పారు. వెంటనే ఎల్‌ఆర్‌ఎస్ సంబంధించిన ఫీజు జనరేట్ అవుతుందన్నారు. పంచాయతీ అధికారి మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పచ్చదనం పరిఢవిల్లాలి



న్యాల్‌కల్‌లో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'స్వచ్ఛదనం పచ్చదనం' క్యార్యక్రమం విజయవంతం చేయాలని జెడ్పీ సీఈఓ, జహీరాబాద్ నియోజకవర్గం ప్రత్యేక అధికారి జానకీరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో అధికారులు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదురోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా పచ్చదనం కనిపించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సాబేర్ హుస్సేన్, ఎంపీడీఓ సురేష్, ఏపీఓ రంగారావు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే సమస్యల పరిష్కారం

జహీరాబాద్: చట్టాలపై అవగాహన కలిగి ఉంటే నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించవచ్చని సీనియర్ సివిల్ జడ్జి సూరిక్రిష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని జాగృతి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పోక్సో, సమాచార హక్కు, మోటారు వాహనాలు, బాల కార్మిక నిర్మూలన, బాల్య వివాహ నిరోధక చట్టాలు, జువెనైల్ జస్టిస్ యాక్టు, ఉచిత న్యాయ సేవా సహాయంపై విద్యార్థులకు వివరించారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడపొద్దని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తహసీల్దార్‌కు, లేదా 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. న్యాయ సలహాలు కావాలంటే మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సుభాష్‌రెడ్డి, బార్ అసోసియేషన్ చైర్మన్ గోపాల్, న్యాయవాదులు సోమశేఖర్, రుద్రయ్యస్వామి పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీ రఘునందన్ రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): "నేను అందరిలా కాదని, అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాకపోతే సహించేది లేదని" మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. శనివారం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు మున్సిపల్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన సమస్యలపై సంబంధిత ఉన్నతఅధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సబ్‌స్టేషన్ మంజూరైనా పనులు ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. తెల్లాపూర్‌లో ఆగస్టు 15వ తేదీ వరకు పోస్ట్ కార్యాలయాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. ఓఆర్‌ఆర్ 30ఎక్స్‌టేషన్ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం ఓఆర్‌ఆర్ 30ఎక్స్‌టేషన్, 152 లింక్ రోడ్డును పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ సెక్రెటరీ హరిచందనకు వినతిపత్రం అందించారు. అలాగే గెటెడ్‌కాలనీలకు తాగునీరు అందించాలని, తెల్లాపూర్‌లో ఎస్‌టీపీ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని మున్సిపల్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ దానకిషోర్ విన్నవించారు.

మహిళలు సాక్షాత్తు శక్తి స్వరూపులు

జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి



మాట్లాడుతున్న లలిత కుమారి

పటాన్‌చెరు టౌన్: మహిళలు మాతృమూర్తులే కాదు.. సాక్షాత్తు బిడ్డకు జన్మనిచ్చే శక్తి స్వరూపులని జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి అన్నారు. శనివారం గుమ్మడిదలలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శిశువులకు పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టిస్తే పోషకాలు అందుతాయని వివరించారు. సైబర్ నేరాలు, షీటీం సేవలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎల్పీఓ అమృత, అడిషనల్ డీఆర్డీఓ జంగారెడ్డి, ఎంపీడీఓ ఉమాదేవి, తహసీల్దార్ గంగాభవాని, ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి, దయాకర్ రావు, జైరాం నాయక్, పల్లవి, అనురాధ, శివ పాల్గొన్నారు.

70వేల ఎకరాలు

ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం

- రాయితీతో రైతులకు ప్రోత్సాహం
- ఉచితంగా మొక్కల సరఫరా
- ప్రతీఏటా సాగు పెంచాలని ప్రణాళిక
- అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ



కోహీర్ మండలంలో నర్సరీలో పెంచుతున్న ఆయిల్‌పామ్ మొక్కలు

జహీరాబాద్: జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు ఉద్యానవన శాఖ అడుగులు వేస్తోంది. సుమారు 70వేల ఎకరాల్లో పంట సాగు లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇందుకనుగుణంగా ప్రణాళికలు రూపొందించి రైతులను ప్రోత్సహిస్తోంది. జిల్లాలోని 12 మండలాల్లో పంట సాగుకు రైతులు ముందుకు వస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రతి ఏటా పంట సాగును విస్తరించుకుంటూ పోతే ఎనిమిదేళ్లలో సాగు లక్ష్యాన్ని అందుకోచ్చని లెక్కలు వేస్తున్నారు. 2023–24 సంవత్సరంలో జిల్లాలో 570 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగైంది. 2024–25లో సుమారు 3వేల ఎకరాల్లో సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 700 ఎకరాల్లో పంట సాగైందని, మరో 1,200 ఎకరాలకు ఇప్పటికే రైతుల నుంచి ఆర్డర్లు వచ్చినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

రైతులకు అవగాహన

పంట సాగు విధానం, పెట్టుబడి వ్యయం, మార్కెటింగ్ తదితర విషయాల్లో ఉద్యానవన శాఖ రైతులకు అవగాహన కల్పిస్తోంది. రైతులను ఈ సాగు వైపు మళ్లించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నారు.ఇప్పటికే కొందరి రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు.

ఎకరాకు ప్రతీఏట రూ1.20 ఆదాయం

నాలుగేళ్ల పంటను కాపాడితే మొదట్లో ఎకరాకు ప్రతీఏట 3నుంచి నాలుగు టన్నుల దిగుబడి వస్తుంది. 7ఏళ్ల అనంతరం సుమారు 10 టన్నుల వరకు దిగుబడులు వస్తాయని, అన్ని ఖర్చులు పోను ఏడాదిలో ఎకరాకు రూ.1.20లక్షల వరకు ఆదాయం వస్తుందని అధికారులు వివరిస్తున్నారు. నెలలో రెండు పర్యాయాలు పంట కోతకు వస్తుంది. టన్నుకు ప్రస్తుతం ధర రూ.14వేలు పలుకుతోంది.

సబ్సిడీపై డ్రిప్ సరఫరా

రైతులను ప్రోత్సహించేలా బిందు సేద్యం పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, బీసీలకు, ఓసీల్లో ఐదు ఎకరాల లోపు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం మేర సబ్సిడీపై డ్రిప్ పరికరాలను సరఫరా చేస్తున్నారు. అన్ని వర్గాల రైతులు తాము పొందే డ్రిప్‌పై 5 శాతం జీఎస్టీని విధిగా చెల్లించాల్సి ఉంటుంది.

రాయితీలు ఇచ్చి ప్రోత్సాహం

ఆయిల్ పామ్ పంట సాగుకు రాయితీ అందించి రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎకరాకు సుమారు 50 నుంచి 57 చెట్ల వంతున మొక్కలు నాటాల్సి ఉంటుంది. ఒక్కో మొక్క ఖరీదు రూ.193 ఉంది. ప్రభుత్వం రైతులకు మొదటి సంవత్సరం మొక్కలకు రూ.11,600, అంతర పంటకు రూ.4,200, బిందు సేద్యానికి రూ.22,518 చెల్లించనుంది. రెండు, మూడు, నాలుగు సంవత్సరాల అంతర పంటల సాగుకు రూ.4,200 వంతున ఆర్థిక సాయం అందిస్తుంది. నాలుగేళ్ల పాటు అన్ని కలుపుకుని ఎకరానికి రూ.50,918 రాయితీ కింద రైతులకు అందుతుంది. ఒక్కో ఎకరానికి రిస్క్ మిటిగేషన్ ఫండ్ కింద రూ.1,100 వంతున రైతుల వద్ద నుంచి సేకరిస్తున్నారు.

ఝరాసంగంలో పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదన

రైతుల సౌకర్యార్థం జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంగం మండలంలో పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం పరిశీలిస్తోంది. నిమ్జ్ ప్రాజెక్టు పరిధిలో పరిశ్రమ కోసం భూములు కేటాయించాల్సిందిగా గోద్రెజ్ సంస్థ యాజమాన్యం కలెక్టర్ క్రాంతిని కలిసి కోరింది. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించారు.

నర్సరీ పెంపకం

కోహీర్ మండలంలోని కొత్తూర్(డి) గ్రామ శివారులో ఆయిల్‌పామ్ నర్సరీని పెంచుతున్నారు. ప్రస్తుతం 1.90లక్షల మొక్కలు నర్సరీలో పెరుగుతున్నాయి. రైతులకు ప్రస్తుతం టెనీరా రకం మొక్కలను ఉద్యానవన శాఖ అధికారులు సరఫరా చేస్తున్నారు. వీటిని మలేషియా, తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుని అందజేస్తున్నారు.

లాభదాయకంగా ఉంటుందని..



ఆయిల్‌పామ్ సాగు లాభదాయకంగా ఉంటుందని ముందుకు వచ్చా. ఇప్పటి వరకు మామిడి, ఆలుగడ్డ, అల్లం పంటలను సాగుచేసి దిగుబడులు రాక నష్టపోయా. 12 ఎకరాల్లో పంట సాగు పనులు చేపట్టాను.

– తిరుపతిరెడ్డి, రైతు, రంజోల్

సద్వినియోగం చేసుకోవాలి



ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. ఈ పంటకు ఎలాంటి నష్టం ఉండదు. దీని సాగు వల్ల ఆర్థికంగా బలపడతారు.

– సోమేశ్వరరావు, జిల్లా ఉద్యానవన అధికారి, సంగారెడ్డి

స్నేహితం..

అనుకోకుండా పరిచయమై జీవితాంతం తోడుంటుంది..

కష్టకాలంలో అండగా ఉండేవారే మిత్రులు

దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహబంధం

నేడు స్నేహితుల దినోత్సవం

మన కోసం మనం ఎంపిక చేసుకునే ఓ అద్భుత బంధం స్నేహ బంధం. తల్లిదండ్రులు జన్మను.. తోబుట్టువులను ఇస్తే.. స్నేహితులను మాత్రం మన అభిరుచులకు తగ్గట్టుగా ఎంపిక చేసుకుంటాం. చిన్నాటి నుంచి కలిసిమెలిసి ఉంటూ.. ఒకరికి ఒకరు తోడుగా ఉండేవారే స్నేహితులు. పాఠశాల.. ఇంటి పక్కన వారితోనో మాత్రమే కాకుండా కొన్ని సార్లు ప్రయాణాల్లో పరిచమయ్యేవారు స్నేహితులుగా ఉండిపోతారు. ప్రస్తుతం పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో ఆన్‌లైన్ పరిచయాలతోనూ ఫ్రెండ్‌షిప్ కొనసాగిస్తున్నారు. ఎంత వయస్సు పెరిగినా ఏరా.. ఒరేయ్ అని పిలిచే స్నేహితులు ఉంటే జీవితం ఆనందంగా ఉంటుంది అంటున్నారు.. అనేక మంది. నేడు (ఆదివారం) స్నేహితుల దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం....

స్నేహం గురించి..

కొల్చారం(నర్సాపూర్) /రామచంద్రాపురం(పటాన్‌చెరు) : ప్రపంచంలో అత్యంత పవిత్రమైన బంధం ఏదైనా ఉందంటే అది 'స్నేహ'బంధమే. కష్టాలొచ్చినా, నష్టాలొచ్చినా వెన్నంటి ఉండేది స్నేహితులే అంటున్నారు పలువురు వక్తలు.

బాలమిత్రుడి కోసం అన్వేషణ



నల్గొండ జిల్లా నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న. 1వ తరగతి నుంచి 6వ తరగతి వరకు ఎం.ఆనంద్ అనే మిత్రుడు ఉండేవాడు. ఇద్దరం ఉదయం నుంచి రాత్రి వరకు కలసి ఉండేవాళ్లం. తర్వాత వాళ్ల కుటుంబం చౌటుప్పల్ వెళ్లిపోయారు. మేము విడిపోయి 39 ఏళ్లు గడుస్తున్నా నా మిత్రుడి జ్ఞాపకాలు మర్చిపోలేనివి. కొంత కాలం అతని కోసం అన్వేషణ చేస్తున్నాను. వాళ్ల తండ్రి పేరు శౌరయ్య వాళ్లు మగ్గం పని చేస్తారు.

– నూకల వేణుగోపాల్ రెడ్డి, డీఎస్పీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సంగారెడ్డి

పార్టీలు వేరైనా ప్రాణ స్నేహితులం



నేను 30 ఏళ్ల కిందట బీజేపీలో ఉన్నప్పుడు (ప్రస్తుతం బీఆర్ఎస్) మా గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి(ప్రస్తుతం బీజేపీ)తో స్నేహం ఏర్పడింది. అప్పటి నుంచి మేము మంచి మిత్రులం. ఇప్పడు పార్టీలు వేరైనా మా స్నేహం విడిపోని బంధం.

– వడ్డే నర్సింహ, తెల్లాపూర్

దసరా రోజు కలుస్తాం



నేను వేముల వాడలో 1985–86లో 10వ తరగతి చదువుకున్నాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు 30 మంది స్నేహితులం కలిసే ఉంటా. ప్రతీ దసరా రోజు అందరం కలుసుకుంటాం. మాలో ఎవరికి కష్టం వచ్చినా అందరం ముందుంటాం.

– ఈశ్వరగారి రమణ, తెల్లాపూర్

మేలు కోరే వారే మిత్రులు



'స్నేహం' కన్న మిన్న ఈ లోకంలో ఏది లేదు. మేలు కోరే వారే స్నేహితులు. అలాంటి స్నేహమే కలకాలం పదిలంగా ఉంటుంది. స్నేహానికి కులమతాలు, లింగభేదాలు, ఆర్థిక విషయాలతో గానీ, వైకల్యంతో కానీ ఎలాంటి సంబంధం ఉండదు. స్నేహితుల సలహాలు, సూచనలతో బాగుపడ్డ వారెందరో ఉన్నారు.

– రమేశ్ బాబు, విశ్రాంత ఉపాధ్యాయులు, రంగంపేట

వాట్సాప్ గ్రూపుగా ఏర్పడి..



సాయం అందిస్తున్న పూర్వవిద్యార్థులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ జెడ్పీ ఉన్నత పాఠశాల 93–94 పదవ తరగతి పూర్వ విద్యార్థులు. తమ మిత్రుల్లో ఎవరికి ఆపద వచ్చినా సాయమందిస్తూ 'తోడుగా మేమందరం' అని భరోసా ఇస్తున్నారు. 2017లో 54 మంది సభ్యులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. క్లాస్‌మేట్స్ ప్రమీల, అనీస్‌ఫాతిమా, మంగమ్మ భర్తలు అకాల మరణం చెందడంతో వారికి ఆసరాగా ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున ఆర్థిక సాయం చేశారు. వర్గల్‌కు చెందిన రామకృష్ణ, నాగిరెడ్డిపల్లి యాదగిరి కుటుంబాలకు రూ.10,000 చొప్పున, క్లాస్‌మేట్ మంగమ్మ మృతి చెందగా పిల్లలకు రూ.17,000 ఆర్థిక సాయం చేశారు. వర్గల్‌కు చెందిన చంద్రం కూతురు వివాహానికి రూ.75,000 నగదు, పుస్తెలు, మెట్టెలు, 2 క్వింటాళ్ల బియ్యం అందజేసి భరోసాగా నిలిచారు. పూర్వ విద్యార్థి మామిడ్యాలకు చెందిన ఆరె లక్ష్మణ్ కరోనా సమయంలో ప్రమాదానికి గురై మానసిక వేదన చెందగా ఇటీవల రూ.80,000 ఆర్థికసాయం చేశారు.

విద్యార్థుల ఉత్సాహం



ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుంటున్న విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తమ వెంట నిరంతరం ఉంటూ, తమ కోసం తపించే స్నేహ బంధం గొప్పదని ప్రముఖ విద్యావేత్త సత్యం అన్నారు. స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీ వాణి పాఠశాలలో ఫ్రెండ్‌షిప్ డేను నిర్వహించారు. విద్యార్థులు తమ తోటి విద్యార్థులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు ధరింపజేశారు. సత్యం మాట్లాడుతూ.. కేవలం డబ్బులు, అంతస్తులు, హోదాలతో మాత్రమే స్నేహితులకు కొలమానం కాదన్నారు. మంచితనం, ఓర్పు, ఒకరి అభివృద్ధిని కాంక్షించే వారితో స్నేహం చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజహితం కోసం పనిచేద్దాం



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గజ్వేల్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగు దశాబ్దాల క్రితం బీకాం చదువుకున్న విద్యార్థులంతా శుక్రవారం ఒక చోట చేరారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ఓ ఫామ్‌హౌజ్‌లో కలుసుకొని తమ మధురాను బూతులను గుర్తు చేసుకున్నారు. సిద్దిపేట, కరీంనగర్, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్, సిరిసిల్ల జిల్లాలకు చెందిన వీరంతా వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో, వృత్తుల్లో, వ్యాపారాల్లో స్థిరపడిన వారు, ఉద్యోగ విరమణ చేసినవారు వాట్సాప్ గ్రూపు ద్వారా ఒక చోట కలిశారు. తాము చదువుకున్న సమయంలో గురువులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సమాజహితం కోసం కలిసి పనిచేయాలని తీర్మానించుకున్నారు.



నగదు సాయం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు(ఫైల్)

నిరుపేదలకు 'చెలిమి' చేయూత

గజ్వేల్‌రూరల్: 1994–95 విద్యాసంవత్సరంలో గజ్వేల్‌తో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా మూడు దశాబ్దాలుగా ఒకరినొకరు కలుకుంటూనే ఉన్నారు. 2021 ఆగస్టు 6న ఫ్రెండ్‌షిప్ డే రావడంతో అనాథలకు అండగా నిలవాలనే దృఢసంకల్పంతో 70మంది మిత్రులంతా కలసి చెలిమి ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఫౌండేషన్‌కు అధ్యక్షుడిగా గుర్రం తులసీదాస్, ఉపాధ్యక్షుడిగా కొండాపురం యాదగిరి, జాయింట్ సెక్రటరీ మంగలిపల్లి కిరణ్‌కుమార్, కోశాధికారి దొంతుల ఆనంద్, కార్యవర్గ సభ్యులుగా గుంటుకు శ్రీను, పిట్ల ఆంజనేయులు, నాగపురి రమేశ్, టెంట్ నర్సింలు, పెద్దూరి శ్రీనివాస్, గంగిశెట్టి నర్సింలు, ఇబ్రహీం, భగవాన్, సంతోష్‌లతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కొక్కరూ ప్రతి నెల రూ.300 చొప్పున జమ చేసి గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు కుకునూర్‌పల్లి, మర్కూక్, రాయపోల్, చిన్నశంకరంపేట మండలాల్లోని గ్రామాల్లో ఇప్పటి వరకు 68 సేవా కార్యక్రమాలు చేపట్టారు. మూడేళ్లుగా ప్రతి నెలా ఒక్కో సేవా కార్యక్రమానికి రూ.15వేల వరకు అందిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు.

యాభై ఏళ్ల స్నేహబంధం



స్నేహితులు శ్రీమన్‌రెడ్డి, రామకిష్టయ్య, పండరిగౌడ్, సిద్దిరామ్‌రెడ్డి, అంజిరెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన కొలుకూరి శ్రీమన్‌రెడ్డి, ల్యాగన్నగారి రామకిష్టయ్య, కామారం గ్రామానికి చెందిన ఆర్.అంజిరెడ్డి, ఖాజాపూర్ గ్రామానికి చెందిన పండరిగౌడ్, ధరిపల్లి గ్రామానికి చెందిన సిద్దిరామ్‌రెడ్డి. ఇందులో శ్రీమన్‌రెడ్డి, రామకిష్టయ్య క్లాస్‌మెట్స్ కాగా, మిగితా వారు సీనియర్లు. చిన్నప్పటి నుంచి అనుబంధంగా కలిసి ఉంటున్న వీరు.. 1980 నుంచి రాజకీయంగాను కలిసి ముందుకు సాగుతున్నారు. సిద్దిరామ్‌రెడ్డి, పండరిగౌడ్ 20 ఏళ్ల పాటు తమ గ్రామాలకు సర్పంచ్‌లుగా పనిచేయడంతో పాటు పండరిగౌడ్ ఎంపీపీగా, సిద్దిరామ్‌రెడ్డి ఏఎంసీ చైర్మన్‌గా పనిచేశారు. రామకిష్టయ్య, శ్రీమన్‌రెడ్డిలు సర్పంచ్‌లుగా పనిచేయగా, అంజిరెడ్డి పీఏసీఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. యాభైఏళ్లుగా వీరి అనుబంధం కొనసాగుతోంది.

ఇల్లు కట్టించారు



కనకయ్యకు ఇల్లు కట్టించిన తోటి స్నేహితులు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో రెక్కాడితే డొక్కాడని కుటుంబానికి చెందిన ఎగ్గోజు కనకయ్య ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నాడు. తన కుల వృత్తి వడ్రంగి పనికి ఆదరణ కరువైంది. చేతి నిండా పని లేక పోషణ కష్టంగా మారింది. దీనికి తోడుగా నివాసం గృహం గాలి వానకు పూర్తిగా కూలిపోయింది. కనకయ్య దీన పరిస్థితికి 1989–90 పూర్వ విద్యార్థులు చలించి ట్రస్ట్ నుంచి రూ.60వేల విలువ గల ఇంటికి కావాల్సిన సామగ్రిని అందజేసి దగ్గరుండి ఇల్లు కట్టించి తమ సేవానిరతిని చాటారు. ఇదే బ్యాచ్‌కు చెందిన గండిపెల్లికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ మోటి నాయక్ ఆత్మహత్య చేసుకుంటే, ఆ కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ బ్యాచ్‌లో ఎవరు పెండ్లి రోజు జరుపుకుంటున్న దంపతులకు గిఫ్టులు అందజేస్తారు. 6 నెలలకు ఓ సారి మిత్రులందరూ కలిసి పిక్నిక్‌కు వెళ్లి ఎంజాయ్ చేస్తారు.

ఆడపిల్లల వివాహాలకు చేయూత



స్నేహితుడి కూతురు వివాహానికి సాయం

హుస్నాబాద్ పట్టణంలో 1983–84 పదవ తరగతి పూర్వ విద్యార్థులు 'బడి సోపతులు' పేరిట స్నేహితులకు, వారి కుటుంబాలకు అండగా ఉంటున్నారు. బడి సోపతులు నిర్వహణ పెద్దపల్లి అదనపు కలెక్టర్ గాజుల శ్యాంలాల్ ప్రసాద్, కొత్తపల్లి అశోక్ ఆధ్వర్యంలో 2013 నుంచి తమ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఇదే గ్రూప్‌కు చెందిన నల్లబెల్లి శ్రీకాంత్ మృతి చెందగా, ఆయన కూతురు మనోజ్ఞలకు రూ.2.60 లక్షల ఆర్థిక సహాయం. మిత్రుడు శ్రీనివాస చారి కూతురు వివాహానికి రూ.లక్ష, దయాకర్ కూతురు వివాహానికి రూ.3 లక్షలు, ఆర్‌బీ చారి కూతురు వివాహానికి రూ.1.50 లక్షల సాయం చేశారు. పూర్వ విద్యార్థి రఘుపతి భార్య రాజేశ్వరికి రూ.2లక్షలు ఇచ్చారు.

కష్టాల్లో తోడుగా ఉంటూ..



నిత్యావసర సరుకులు ఇస్తున్న దృశ్యం (ఫైల్)

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2000–2001 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదర్శంగా నిలుస్తున్నారు. స్నేహం కోసం అనే నినాదంతో కలిసి చదువుకున్న పలువురు పూర్వ విద్యార్థులు వివిధ కారణాలతో మృతి చెందిన ఆకుబత్తి వితల్ రూ.45 వేలు, బస్వారాజు సతీశ్ రూ.51వేలు, జాలిగం రాజు రూ.48 వేలు కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు. అలాగే వర్షాలతో ఇళ్లు కూలిన శ్రావణపల్లి వెంకటేశ్ కుటుంబాలనికి రూ.25 వేలు ఆర్థిక సాయం చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. 'స్నేహం కోసం 2000–01 బ్యాచ్' ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నట్లు తిప్పారపు అనీల్, నిమ్మన గొట్టు శ్రీనివాస్, బండ జగన్, సల్ల శ్రీనివాస్, వెల్పుల శంకర్, గాజుల రవీందర్, జాలిగం బాబు, శనిగరం రమేశ్ తిప్పారపు శ్రీనివాస్, వెల్పుల మహేశ్, మామిడాల కిరణ్ పేర్కొన్నారు.

మేమున్నామంటూ..



ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

కౌడిపల్లి(నర్సాపూర్): అనారోగ్యానికి గురై ఆస్పత్రికి, మందుల ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న స్నేహితుడికి మేమున్నామంటూ క్లాస్‌మెట్స్ అండగా నిలిచి ఆర్థిక సాయం అందిస్తున్నారు. మండల కేంద్రమైన కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో 1997–98బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు తమ స్నేహాన్ని చాటుకున్నారు. క్లాస్‌మెట్‌లోల కౌడిపల్లికి చెందిన పీ.శంకర్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతేడాది లివర్ సమస్యతో అనారోగ్యానికి గురయ్యాడు. విషయం స్నేహితులకు తెలియడంతో క్లాస్‌మెట్స్ స్పందించారు. అతడికి మందులు, వైద్యం ఖర్చుల కోసం 2023 ఫిబ్రవరిలో రూ.76 వేలు, 2024 జూలైలో రూ.36 వేలు ఆర్థిక సాయం అందించి కుటుంబానికి మేమున్నామని ధైర్యం చెప్పారు.

స్నేహితులు.. ఆత్మబంధువులు



హోలి వేడుకల్లో స్నేహితులు(ఫైల్)

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని వెంకటేశ్వర స్కూల్ 1999–2000 టెన్త్ క్లాస్ బ్యాచ్‌కి చెందిన కొంత మంది విద్యార్థుల మధ్య ఏర్పడిన స్నేహం ఆత్మీయబంధంగా మారింది. పట్టణానికి చెందిన రాఘవేందర్, భరత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సంజయ్, శ్రీధర్, సంపత్, కిషన్, వివేకర్ రెడ్డి, సికిందర్‌రాథ్‌లు 24 ఏళ్ల కిందట కలిసి చదువుకున్నారు. కాలం మారుతున్నా మిత్రుల మధ్య స్నేహ బంధం ఇప్పటికీ తగ్గలేదు. పట్టణంలో ఉన్న వారు నెలకు ఓ సారి కలుస్తుంటారు. ఫ్రెండ్స్‌గా ఎంజాయ్ చేయడమే కాదు తోటి మిత్రుడికి ఆపదొస్తే ఆదుకుంటారు. హోలి వేడుకల సమయంలో దోస్తులతా కలిసి ఎంజాయ్ చేస్తారు.

వృత్తులు వేరైనా.. ప్రవృత్తి ఒక్కటే



అభిలాష్, అజయ్‌గౌడ్

పాపన్నపేట(మెదక్): వృత్తులు వేరైనా ప్రవృత్తులు ఒక్కటిగా జీవిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు పాపన్నపేట మండలం ఎల్లాపూర్‌కు చెందిన అంతోల్ల అభిలాష్, బద్దిగారి అజయ్‌గౌడ్. చిన్నప్పటి నుంచి కలిసిమెలిసి చదుకున్న వారిద్దరి ఆశయాలు ఒక్కటే. సామాజిక న్యాయం కోసం తెగించి పోరాడాలనే లక్ష్యం వారిది. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చేస్తూ, ప్రొఫెసర్ కోదండరాం శిష్యుడిగా రంగంలోకి దిగిన అభిలాష్ టీఆర్ఎస్వీ ఉమ్మడి మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడిగా జిల్లా స్థాయి ఉద్యమానికి ఊపిరిలూదాడు. ప్రాణస్నేహితుడు అజయ్‌గౌడ్ టీఆర్ఎస్వీ మెదక్ నియోజక వర్గ కార్యదర్శిగా అతనికి తోడ య్యాడు. అనంతరం అభిలాష్ సెక్యూరిటీ పోలీస్ ఆఫీసర్ ఉద్యోగం పొందగా, అజయ్‌గౌడ్ గ్రామ ఉప సర్పంచ్‌గా పని చేశాడు. యువకులకు తగిన గైడెన్స్ ఇవ్వడం, నిరుపేద విద్యార్థులకు సాయం చేయడంఅనారోగ్యంతో ఉన్నవారిని ఆస్పత్రికి తరలిస్తున్నారు.



ఆషాఢం వంటల కార్యక్రమంలో భాగంగా వాకర్స్ గ్రూపు కుటుంబాలు

నడక కలిపిన స్నేహ బంధం

మార్నింగ్ వాక్‌లో మిత్రులుగా మారి | నలుగురు నుంచి 34 మంది దాకా..

సిద్దిపేటఎడ్యుకేషన్: ఒకరు ఉపాధ్యాయుడు... మరొకరు వ్యాపారవేత్త, ఇంకొకరు ప్రొఫెసర్, వేరొకరు ప్రైవేట్ ఉద్యోగి ఇలా వారంతా ఒక్కొక్కరూ ఒక్కో రంగంలో పనిచేస్తూ జీవన ప్రయాణం సాగిస్తున్నారు. సరిగ్గా 8 ఏళ్ల కిందట ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ వీరిలో నలుగురు ఉదయాన్నే వాకింగ్ ప్రారంభించారు. ఇలా ప్రారంభమైన వాకింగ్ సభ్యులు ఒక గ్రూపుగా ఏర్పడి నేడు 34 మందికి చేరుకున్నారు. ఉదయం 6 గంటలకే డిగ్రీ కళాశాల మైదానం చేరుకొని గంటపాటు నడిచి మరో అరగంట వ్యాయామం, సూర్యనమస్కారాలు చేస్తూ ఒకరికొకరు ఆప్తమిత్రులుగా మారిపోయారు. అందరూ గ్రౌండ్‌కు క్రమం తప్పకుండా రావాలని, వారంలో మూడు రోజులు డ్రెస్ కోడ్ పాటించాలని నియమం పెట్టుకున్నారు. డ్రెస్ కోడ్ పాటించకుంటే చిన్నా చితకా ఫైన్ సైతం విధించేందుకు నిర్ణయించుకున్నారు. ఇప్పటి వరకూ కేవలం గ్రూప్ సభ్యులకు మాత్రం సహాయ సహకారాలు అందించుకొని ఈ సారి సామాజిక సేవా కార్యక్రమాలకు అంకితం కావాలని నిర్ణయించుకున్న గోల్డ్ వాకర్స్‌లో పలువురి మనోగతం వారి మాటల్లోనే...

కార్యక్రమాలు చేద్దాం



మన గ్రూపు సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తే బాగుంటుందని నా అభిప్రాయం. అనాథ పిల్లలకు అవసరమైన సౌకర్యాలు, లేదా పేద విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించేందే కార్యక్రమాలను నిర్వహిస్తే బాగుంటుంది.

–నర్సింలు, వ్యాపారవేత్త

వెరైటీగా చేద్దాం..



ఫ్రెండ్‌షిప్‌డేను ప్రతీసారీ జాలీగా చేసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నాం. కానీ ఈసారి అలా కాకుండా కాస్త వెరైటీగా చేద్దాం.. ఎంజాయ్‌తోపాటు మరేదైనా కొత్తగా ఆలోచిద్దాం. మీకేమైనా ఆలోచన వస్తే సూచనలు, సలహాలు ఇవ్వండి..

–డాక్టర్ గోపాల సుదర్శనం, అసిస్టెంట్ ప్రొఫెసర్

ఆర్థిక సాయం చేద్దాం..



సరే మీ ఆలోచన బాగానే ఉందికాని ఏం చేద్దాం.. మన గ్రూపులో ఎవరికైనా ఇబ్బందులు ఉంటే వాటిని తొలగించేందుకు ఏమైనా ఆర్థిక సాయం చేద్దామా.. పిల్లల ఉన్నత చదువుల కోసం గైడెన్స్ ఇచ్చేందుకు ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏమైనా ఏర్పాటు చేద్దామా..

–దేవేందర్‌రెడ్డి, డైరెక్టర్, మెరిడియన్ స్కూల్

రెండు మొక్కలు నాటుదాం



అవన్నీ కూడా దీర్ఘకాలికంగా చేయాల్సిన కార్యక్రమాలు వాటిని ఇప్పటికిప్పుడే అమలు చేయడంలో కొన్ని ఇబ్బందులు ఉండే అవకాశం ఉంది. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు తక్షణంగా గ్రూపు సభ్యులంతా ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి అవి పెరిగి వృక్షాలు అయేంతవరకు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకుందాం..

–మధుసూదన్‌రెడ్డి, అడ్వకేట్

నేడు 34 మంది వాకర్స్



మొక్కలు నాటాలనే మధు ఆలోచన బాగుంది... ఎనిమిదేళ్ల కిందట నేను వాకింగ్ ప్రారంభించినప్పుడు నాతో పాటు ముగ్గురు మాత్రమే ఉన్నారు. అనంతం ఒక్కొక్కరుగా నేడు 34 మంది వాకింగ్‌కు రావడం ఆత్మీయ మిత్రులుగా మారడం చాలా సంతోషంగా ఉంది. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మనవంతుగా ప్రతి ఒక్కరం మొక్కలు నాటి వాటిని సంరక్షించుకుందాం..

–మారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, టీచర్, వాకింగ్ గ్రూప్ ఫౌండర్

సమస్యలపై స్పందిస్తూనే ..



మన గ్రూప్ సభ్యులకు ఉండే సమస్యలపై మనం ఎప్పటికప్పుడూ స్పందిస్తూనే ఉన్నాం. ఆ విషయం పక్కన పెడితే పిల్లల చదువుల కోసం గైడెన్స్ ఇవ్వడం బాగానే ఉంటుంది. కానీ ఇంకా కొత్తగా ఏదైనా చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం.

–తిరుపతిరెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక సేవా

దోస్తులంటే కేసీఆర్‌కు ప్రాణం

కలిసి తిరిగేటోళ్లం.. బావుల్లో ఈత కొట్టేటోళ్లం

కేసీఆర్ బాల్య మిత్రుడు పోలిశెట్టి లక్ష్మీనారాయణ



కేసీఆర్‌తో దుబ్బాకకు చెందిన బాల్యస్నేహితులు

దుబ్బాక : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాతో పాటే దుబ్బాక ప్రభుత్వ హైస్కూల్‌లో 4వ తరగతి నుంచి పదోతరగతి వరకు చదివిండు. దోస్తులంటే కేసీఆర్‌కు ప్రాణముండే.. పాఠశాలకు ఎగ్గొట్టి చెరువులు, బావుల వద్దకు వెళ్లి ఈత కొట్టేటోళ్లమని కేసీఆర్ బాల్య మిత్రుడు దుబ్బాకకు చెందిన పోలిశెట్టి లక్ష్మీనారాయణ చెప్పారు.

నేను టీచర్‌ను.. కేసీఆర్ అటెండర్

కేసీఆర్‌కు చదువుకునే రోజుల నుంచే నాయకత్వ లక్షణాలుండే.. క్లాస్‌లోతన అక్క సుమతితో కలసి చింతమడక నుంచి నడుచుకుంటూ 8 కిలోమీటర్లు నడిచి వచ్చేవాడు. తర్వాత దుబ్బాకలోనే రూం తీసుకొని చదువుకుండు. కూడా మానిటర్‌గా ఉండేవాడు. పద్యాలు, పాటలు బాగా పాడేవాడు. కుండను తబల లాగా కొట్టుకుంటూ పాటలు పాడేవాడు. రామసముద్రం, పెద్ద చెరువు కట్టల మీద కూర్చుండి కబుర్లు చెప్పుకోవడం, ఆటలు ఆడుకోవడం ప్రతిరోజు మా దినచర్యగా సాగేది. సెలవుల్లో కేసీఆర్‌తో కలిసి చింతమడకతో పాటు వారి బంధువుల ఊర్లకు పోయేటోల్లం, మా ఇళ్లకు ఆయన వచ్చేటోడు. 1967–68లో పాఠశాలలో జరిగిన స్వపరిపాలనలో నేను టీచర్‌గా పనిచేస్తే.. కేసీఆర్ అటెండర్‌గా ఉన్నాడు అని గత జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్నాడు.

కేసీఆర్ దోస్తు అని హాస్పిటల్‌లో బిల్లు తక్కువ చేసింద్రు

'నాకు గత 40 రోజు క్రితమే గుండె సమస్య వస్తే హైదారబాద్‌లో హాస్పిటల్‌లో స్టంట్ వేసింద్రు. అప్పుడు నా జేబులో కేసీఆర్‌తో ఉన్న ఫొటోను చూసి డాక్టర్లు అడిగితే కేసీఆర్ నా దోస్తు అని చెప్పిన. ఆ ఫొటో చూసి బిల్లు తక్కువ తీసుకుంద్రు. కేసీఆర్‌తో పాటు మా సీనియర్ రొట్టె రాజమౌళి అన్నా గొల్ల గోపాల్, వడ్లకొండ భద్రయ్యతో పాటు కేసీఆర్ సీఎం అయ్యాక మా దోస్తులమంతా పోయి కలిసి ఫొటోలు దిగాం, ఆయనతో కలిసి భోజనాలు చేసి మా యోగ క్షేమాలు చెప్పుకున్నాం. అలాగే దుబ్బాకకు వచ్చినప్పుడు సైతం కలిస్తే బాగోగులు అడిగి తెలుసుకుండు.'అని 75 ఏళ్ల వయస్సులో ఉన్న లక్ష్మీనారాయణ తన బాల్యంలో కేసీఆర్‌తో తిరిగిన రోజులను సాక్షితో పంచుకున్నాడు.

16 ఏళ్లుగా 'స్నేహ మంజీర'



విద్యార్థికి నగదు అందజేత

జోగిపేట(అందోల్): పట్టణంలోని 1984–85 సంవత్సరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి 'స్నేహ మంజీర' పేరుతో అసోసియేషన్‌ను 2008లో ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న సీహెచ్.గోవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో పేద వారికి చేయూత నివ్వడమే కాకుండా, విద్యార్థులను చైతన్య పరుస్తూ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు. ప్రతీ సంవత్సరం పదవ తరగతిలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముగ్గురిని ఎంపిక చేసి నగదును అందజేయడం, పాఠశాల ఆవరణలో సుమారుగా రూ.60 వేలు వెచ్చించి మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టారు.

బాల్య మిత్రులకు బాసటగా..



1997 బ్యాచ్ విద్యార్థులు

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిరం ఉన్నత పాఠశాలకు చెందిన 1996–97 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ రంగాల్లో స్థిరపడ్డారు. ఈ బ్యాచ్‌కు చెందిన 45 మంది విద్యార్థులు తమ తోటి స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ఆపద సమయంలో ఆదుకుంటున్నారు. 2015లో హద్నూర్ గ్రామానికి చెందిన తోటి విద్యార్థి విష్ణువర్ధన్ విద్యుత్ షాక్‌తో మరణించాడు. ఇతడి కుటుంబానికి రూ.40వేలు, 2018లో అల్లాదుర్గం మండలం లింగ్వేర గ్రామానికి చెందిన తోటి విద్యార్థి నరేందర్‌రెడ్డి మరణించాడు. అతడి కుటుంబానికి రూ.1.14లక్షలను అతడి ఇద్దరి పిల్లల పేరిట ఎల్ఐసీ బాండ్లు, కుట్టు మిషన్, కొంత నగదు రూపంలో అందించి చేయూతనిచ్చారు.